## విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 ( నమస్తే తెలంగాణ ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

## ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

### తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

# సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం



ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

### బోనస్ హామీ... బోగసేనా ?

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్)లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రూ.22 వేలు నష్టం..



నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

**- రాము, ఖోడద్, తలమడుగు**

### 15 క్వింటాళ్లు మిగులుతుంది



నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

**- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం**



చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

## బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

## వీఎన్ఈఎస్ లైసెన్స్ రద్దు

### యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

# నగరం ట్రాఫిక్‌మయం



నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని విక్టర్ ప్యాలెస్ రోడ్డులో వాహనాల పార్కింగ్, జనాల రద్దీ



నాందేవ్‌వాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద..



గాంధీచౌక్ మూలమలుపు ప్రాంతంలో కుమార్‌గల్లీ వద్ద..

వినాయక్‌నగర్, అక్టోబర్11 :జిల్లాకేంద్రంలోని ప్రముఖ రోడ్లన్నీ ట్రాఫిక్‌మయం అవుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవీ నవరాత్రులతో పాటు దసరా పండుగ కోసం షాపింగ్ చేసేందుకు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో నగరానికి తరలిస్తున్నారు. వాహనదారులు, ఆటోరిక్షాలు, ప్రైవేట్ వాహనాలతోపాటు దుకాణాల

### ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

ఎదుట వాహనాల పార్కింగ్‌తో నెహ్రూ పార్క్ నుంచి రైల్వేస్టేషన్ ఏరియా వరకు రోడ్లన్నీ ప్రజలతో కిక్కిరిపోతున్నాయి. ప్రముఖ బట్టల షోరూం ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్ సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వర్తిస్తున్నా.. ట్రాఫిక్‌జామ్‌తో పాదచారులతో పాటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితులు, దవాఖానాలకు వెళ్లాల్సిన వారి పరిస్థితి అయితే ఇక అంతే సంగతి. నగరంలోని ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని, మరింత సిబ్బందిని నియమించి, ట్రాఫిక్‌జామ్ కాకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## పోలీస్ ఫ్లాగ్‌డే సందర్భంగా ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు

వినాయక్‌నగర్, అక్టోబర్ 11 : శాంతిభద్రతలు, సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ సంబంధిత అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల ప్రతిభ తెలిసేలా (3) ఫొటోలు, 3 నిమిషాలు, అంతకన్నా తక్కువ నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్ తీసి, ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోగా కమిషరేట్ కార్యాలయంలోని ఎస్‌ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ లేదా పోలీస్ పీఆర్వోకు అందజేయాలి తెలిపారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు షార్ట్ ఫిల్మ్, ఫొటోలను రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్ర డీజీపీ ఆఫీస్‌కు పంపుతామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 94400 01827 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## ఫేక్ మెస్సేజ్‌లు పంపి మోసంచేస్తున్న వారెవరు?

- ఏటీఎంలలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన వారే టార్గెట్
- రోజుకో జిల్లాను ఎంచుకుంటున్న మోసగాడు
- పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు

వినాయక్‌నగర్, అక్టోబర్ 11 : సులువుగా డబ్బులు సంపాదించేందుకు మోసగాళ్లు కొత్త తరహా మోసానికి తెరలేపారు. ఏటీఎంలలో డబ్బులు డిపాజిట్ చేసే వారినే టార్గెట్ చేస్తున్నారు. వారితో మాటామాట కలిపి తమకు డబ్బులు అత్యవసరం ఉన్నాయని, డిపాజిట్ చేసే బదులు నగదును తమకు ఇస్తే, ఫోన్‌పేలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత ఫేక్ మెస్సేజ్‌ను పంపి, ఆన్‌లైన్‌లో డబ్బులు జమకాలేదని బాధితుడు తెలుసుకునే లోపే అక్కడి నుంచి జారుకుంటారు.

**జిల్లాకేంద్రంలో వరుసగా రెండు ఘటనలు**

జిల్లా కేంద్రంలో ఈ నెల 7, 8వ తేదీల్లో ఈ తరహా మోసాలు చోటు చేసుకున్నాయి. మాక్లూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయానికి అతి దగ్గరలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.30 వేల నగదు డిపాజిట్ చేసేందుకు రాగా.. మోసం చేశాడు. అదేవిధంగా నగరంలోని వినాయకనగర్ కు చెందిన మరో వ్యక్తి ఆర్యనగర్ ఏరియాలో ఉన్న ఏటీఎంలో రూ.50వేలు డిపాజిట్ చేసేందుకు వెళ్లగా మోసం చేశాడు. ఈ మోసాలను సీపీ కల్మేశ్వర్ సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, ఏటీఎం సెంటర్ల వద్ద నిఘా పెట్టడంతో పాటు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆయా ఏటీఎం సెంటర్ల వద్ద ఉన్న సీసీ ఫుటేజీలతోపాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఫుటేజీల రికార్డులను సేకరించారు. సదరు మోసగాడు నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలో సైతం ఇదే తరహా ఘటనలకు పాల్పడినట్లుగా పోలీస్ వర్గాలకు సమాచారం వచ్చింది. రోజుకో జిల్లాలో మోసానికి పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఏటీఎం కేంద్రాల వద్ద మాటు వేసి, మోసానికి పాల్పడుతున్న దుండగుడి చిత్రాలు పోలీసుల చేతికి అందినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.




